# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 3 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 8 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :3 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 8 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం

- నెల్లూరు నుంచి నేరుగా తిరుమల వెళ్లిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూపీ సీఎం యోగి
- వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస
- స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్
- గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు.దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

- మిగతా 2లో

## కార్యకర్తలే పార్టీకి బలం..

## వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

### లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు

- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్–2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్–2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2లో



గ్యాస్ వినియోగదారులకు

## గుడ్‌న్యూస్..

### బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

- మిగతా 2లో



## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

### దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది వారే: లోక్‌సభ స్పీకర్

- భారత చరిత్రలో మహిళలే అసలైన మార్పునకు మార్గదర్శకులన్న ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర కీలకమని వెల్లడి
- నేటి మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని వ్యాఖ్య
- మహిళా శాసనసభ్యుల కోసం జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేక వర్క్‌షాప్

- మిగతా 2లో

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని

- మిగతా 2లో

## కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

### కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

- కుప్పంలో మాజీ సైనికుడైన టీచర్‌పై తరగతి గదిలో దాడి
- గురుపూజోత్సవం రోజే విద్యార్థుల ముందే అమానుష ఘటన
- మీడియా ప్రతినిధులమని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- స్పోర్ట్స్ కోటా టీచర్లే లక్ష్యంగా బెదిరింపుల దందా నడుస్తోందని వెల్లడి
- ఉపాధ్యాయుల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన ప్రభుత్వం

- మిగతా 2లో






తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్

## కంటతడీ

- అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

- మిగతా 2లో

## డీఎస్సీలో భారీ స్కామ్ జరిగింది..

### మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐతో విచారణ జరిపించాలి

- డీఎస్సీ నియామకాల్లో భారీ స్కామ్ జరిగిందని వైసీపీ ఆరోపణ
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్
- ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- స్పోర్ట్స్ కోటా, అర్హతల్లో అక్రమాలు జరిగాయంటూ సజ్జల ఆరోపణ
- విచారణకు ఆదేశించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక

- మిగతా 2లో



## ఉద్యోగాల పేరుతో మోసం

### ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్
- లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

- మిగతా 2లో



## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

## 12 మంది దుర్మరణం

- ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పత్‌లో పికప్ వాహనం బోల్తా
- ప్రమాదంలో 12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు
- రాజస్థాన్ నుంచి బదౌన్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన
- డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- మృతుల కుటుంబాల కోసం పోలీసులు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

- మిగతా 2లో





## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది.

- మిగతా 2లో






## మెగా డీఎస్సీపై... ఓపెన్ డిబేట్ సాధ్యమా

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల చుట్టూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నడుపుతున్న రాజకీయ డ్రామా రోజురోజుకూ తన విశ్వసనీయతను కోల్పోతోంది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో బురద చల్లడం, ప్రెస్ మీట్లలో వ్యాఖ్యలు చేసి వెళ్లిపోవడం కాకుండా.. ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌పై వైసీపీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆధారాలుంటే ప్రజల ముందు పెట్టాలి తప్ప, తెరవెనుక దాక్కుని రాళ్లేయడం, ముసుగు సంస్థలతో తప్పుడు ప్రచారాలు చేయించడం, రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ విచారణ కోరడం రాజకీయం కాదు. అసలు సీబీఐకి అప్పగించిన ఏ కేసును ఆ సంస్థ ఎంత త్వరగా పూర్తి చేసిందో వైసీపీ స్పష్టం చేయగలదా? మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణే ఏళ్ల తరబడి కొలిక్కిరాకుండా సాగుతుంటే, ఉపాధ్యాయ నియామకాలను సీబీఐకి ఇవ్వాలనడం పదహారు వేల మంది టీచర్ల కుటుంబాలపై కుట్రలు చేయడమే.ప్రజాస్వామ్యంలో ఏ విషయమైనా తేలాల్సింది ప్రజల సమక్షంలో, చట్టసభల ప్రాంగణంలో! విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీ లోపలైనా, బయటైనా, సమయం-వేదిక జగన్ రెడ్డి ఇష్టానికే వదిలేస్తూ పాయింట్ టు పాయింట్ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు స్థాయిలో 148 రోజుల్లో అత్యంత పారదర్శకంగా, టీసీఎస్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, సుప్రీంకోర్టు రిజర్వేషన్ నిబంధనలకు కట్టుబడి భర్తీ చేశామని ప్రభుత్వం ఆధారాలతో సహా వివరణ ఇచ్చింది. 141 రకాల కోర్టు కేసులతో నియామకాలను నిలిపివేసేందుకు ప్రయత్నించినా, న్యాయస్థానాలు వాటిని కొట్టివేస్తూ నోటిఫికేషన్‌లోని పారదర్శకతను సమర్థించాయి. ఇన్ని వాస్తవాలు కళ్లముందు కనిపిస్తుంటే, నాకు నేను చాలు అంటూ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలతో కవర్ డ్రైవ్‌లు వేయించడం జగన్ రెడ్డికి రాజకీయంగా మారింది. .నేరుగా లోకేష్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నది జగన్ మోహన్ రెడ్డి అయినప్పుడు, ఆయనే స్వయంగా వచ్చి చర్చకు కూర్చోవాల్సిన బాధ్యత ఉంది. విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి అంశంలోనూ పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి లోకేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో డేటాను సమర్పించారు. మరి వైసీపీ వద్ద నిజంగానే డీఎస్సీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయనడానికి ఆధారాలు ఉంటే, వాటిని మంత్రి ముందే బహిర్గతం చేసి ప్రజలకు ఎందుకు నిజాలు తెలియజేయకూడదు? బెయిల్ నిబంధనలు లేదా విచారణల సాకు చూపి చట్టసభలకు రాకుండా తప్పించుకోవడం ద్వారా తాము చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ బురదచల్లుడు చర్యలేనని జగన్ స్వయంగా అంగీకరించినట్లవుతోంది. రోజుకో డ్రామా ఆడటం, ఆధారం లేని ఆరోపణలు చేసి పారిపోవడం వల్ల ప్రతిపక్షానికే నష్టం. గత ఐదేళ్ల తమ హయాంలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేక, దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ బడులకు వెళ్లేలా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన చరిత్ర వైసీపీది. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి మొదటి సంతకంతో మెగా డీఎస్సీని పూర్తి చేసి వేలాది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందిస్తే ఉద్యోగం రాని వారిని రెచ్చగొట్టేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిరుద్యోగ యువత భవిష్యత్తు , విద్యార్హతల ఆధారంగా జరిగిన మెగా డీఎస్సీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి జగన్ రెడ్డికి మంచి అవకాశం ఉంది. మీడియా ముందు హాఫ్ ట్రూత్స్ మాట్లాడటం, బాధ్యతారాహిత్యంగా రాజీనామాలు కోరడం మాని, లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి ముఖాముఖి చర్చకు రావాలి. ఆధారం లేని బురద చల్లే రాజకీయాలకు ముగింపు పలికి, ప్రజల సమక్షంలో నిజానిజాలు తేల్చుకోవడమే ప్రజాస్వామ్య పద్ధతి!పారిపోవడం వీరత్వం అనిపించుకోదు; నిజాయితీ ఉంటే జగన్ రెడ్డి చర్చల వేదికపై అడుగుపెట్టాల్సిందే

## కుప్పంలో టీచర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన విద్యాశాఖ..

చిత్తూరు జిల్లా కుప్పంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. గురుపూజోత్సవం రోజే, తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఒక ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు దేశానికి సేవ చేసిన ఒక మాజీ సైనిక హవల్దార్ కావడం గమనార్హం. ఈ ఘటనను పాఠశాల విద్యాశాఖ సుమోటోగా స్వీకరించి, నిందితులపై కఠినమైన క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. ఇది స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఒక వ్యవస్థీకృత బెదిరింపుల దందా అని అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు.

**విద్యార్థుల ముందే దాడి**

వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజున కుప్పంలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. మాజీ సైనికుడైన ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా, ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. తాము మీడియా ప్రతినిధులమని చెబుతూ, ఉపాధ్యాయుడి మిలిటరీ గుర్తింపు కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు చూపించాలంటూ దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల ముందే అవమానకరంగా మాట్లాడారు. తన వ్యక్తిగత పత్రాలు అడిగే అధికారం మీకెక్కడిదని ఉపాధ్యాయుడు ప్రశ్నించడంతో, వారు రెచ్చిపోయి ఆయన కాలర్ పట్టుకుని గొడవకు పాల్పడ్డారు.
విచారణలో ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని తేలింది. ఘటనకు రెండు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 3న, నిందితులు ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి 20 నిమిషాల పాటు మాట్లాడారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఆయనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తామని బెదిరించారు. ఈ ఘటనతో ఉపాధ్యాయుడు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**నిందితుల అరెస్ట్, బెదిరింపుల దందా వెలుగులోకి**

ఈ అమానుష ఘటనపై పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి, స్థానిక పోలీసుల సమన్వయంతో క్రిమినల్ కేసు నమోదు చేయించింది. పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, మీడియా ప్రతినిధులమని చెప్పుకుంటున్న శ్రీకాంత్ (సాక్షి రిపోర్టర్), గణేశ్ (సాక్షి కెమెరామెన్) అనే ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. "ఇది చాలా బాధాకరమైన సంఘటన. దేశానికి సేవ చేసి, ఇప్పుడు ఉపాధ్యాయుడిగా గౌరవప్రదమైన వృత్తిని స్వీకరించిన ఒక మాజీ సైనికుడి పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 372 మంది ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. మీడియా ప్రతినిధులుగా నటిస్తూ, సర్టిఫికెట్లు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఆమె వివరించారు.

**ఉపాధ్యాయులకు పూర్తి రక్షణ**

పాఠశాల ప్రాంగణాల్లోకి అనధికారికంగా ప్రవేశించి ఉపాధ్యాయులను బెదిరించినా, వేధించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తీవ్రంగా హెచ్చరించింది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చింది. ఇలాంటి బెదిరింపు కాల్స్ లేదా వేధింపులు ఎదురైతే, వెంటనే తమ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ సూచించింది. బాధితులకు పూర్తి పరిపాలన, చట్టపరమైన మద్దతు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిరాధార ఆరోపణలు మాని, ఆధారాలతో కూడిన ఫిర్యాదులు ఉంటే విద్యాభవన్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు అందజేయాలని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# కార్యకర్తలే పార్టీకి బలం.. వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

- మొదటి పేజి తరువాయి
నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# డీఎస్సీలో భారీ స్కామ్ జరిగింది..

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. ఇది 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్' స్కామ్ అని అభివర్ణించిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సోమవారం అమరావతిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీచర్ పోస్టులను అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా, పాఠశాల విద్య కమిషనర్, శాప్ ఎండీ వంటి అధికారులతో మొక్కుబడి సమాధానాలు ఇప్పించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జీవో)లను మార్చడం వంటి కీలక నిర్ణయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, 'డీ ఫ్యాక్టో సీఎం'గా వ్యవహరిస్తున్న మంత్రి లోకేశ్‌కు తెలియకుండా జరగవని, కాబట్టి శాఖాపరమైన విచారణలతో ప్రయోజనం లేదని సజ్జల స్పష్టం చేశారు.'మెగా డీఎస్సీ' పేరుతో కొత్తగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, కానీ వాస్తవానికి తమ ప్రభుత్వ హయాంలో జగన్ నోటిఫై చేసిన 6,300 పోస్టులనే ఇప్పుడు భర్తీ చేస్తున్నారని సజ్జల గుర్తుచేశారు. పారదర్శకతకు విరుద్ధంగా, ఎంపిక వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచకుండా, అభ్యర్థులకు 'వ్యక్తిగత సమాచారం' పంపి గోప్యత పాటిస్తున్నారని ఆరోపించారు.
ఈ సందర్భంగా సజ్జల పలు ఆరోపణలు చేశారు. కోచింగ్ సెంటర్ల ద్వారా 120 ప్రశ్నలను రూ. 3 లక్షలకు అమ్ముకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో చంద్ర నాయక్, సుధా రాణి, రియాజుల్లా, పావని వంటి వారు జరగని క్రీడల్లో పాల్గొన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించారని ఆరోపించారు. పరీక్ష రాయకుండానే రూ. 15 లక్షలు చెల్లించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించినట్లు ఓ మహిళా అభ్యర్థి టెలివిజన్‌లో అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అనంతపురంలో గణితం డిగ్రీ ఉన్న తిరుమల అనే అభ్యర్థిని ఇంగ్లీష్ టెట్‌లో అర్హత లేకపోయినా ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారని, 75 మార్కులు కటాఫ్ ఉండగా 63 మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థి విశ్వేశ్వరరావును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ అనే అభ్యర్థిపై 2025 డిసెంబర్‌లో ఆర్డీవో ఇచ్చిన నివేదికను కలెక్టర్ తొక్కిపెట్టారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, హర్యానా వంటి రాష్ట్రాల్లో జరిగిన టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో మంత్రులు, ఉన్నతాధికారులు సీబీఐ, ఈడీ విచారణలు ఎదుర్కొని జైలుకు వెళ్లిన విషయాన్ని సజ్జల గుర్తుచేశారు. "ఎంతకాలం బాధ్యులైన వారిని కాపాడతారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం సీబీఐ విచారణకు అంగీకరించకపోతే, తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం ఎందుకు స్వతంత్ర దర్యాప్తునకు వెనుకాడుతోందో ప్రజలు, అర్హులైన అభ్యర్థులు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.
రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్-సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

**గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు.
ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

- మొదటి పేజి తరువాయి
ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది.మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- మొదటి పేజి తరువాయి
ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది.గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు.కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## ఉద్యోగాల పేరుతో మోసం: ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- మొదటి పేజి తరువాయి
అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది.రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్‌షాప్‌లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు.ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఆడాకుల "పిజిఆర్ఎస్ "లో179 అర్జీలు...!

**మండల అభివృద్ధి అధికారి "జెడివి ప్రసాద్ రావు" వెల్లడి**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 7:**జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సోమవారం ఆడాకుల లో నిర్వహించిన "పిజిఆర్ఎస్" లో ప్రజల నుండి 179 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి జెడివి ప్రసాద్ రావు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 178, విద్యుత్ శాఖ 1,పై ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. వాటన్నింటిని శాఖల వారీగా సంబంధిత అధికారులకు అందించి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించడం అయిందని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాద్, ఎస్ఎంఐ ఇంజనీర్ రామకృష్ణ, వివిధ శాఖలకు సంబంధించిన మండల అధికారులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రింతాడ సమస్యలపై వినతి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** రింతాడ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ గ్రామసభలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. రింతాడ స్మశానవాటికలో ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణం, చెలకవీధికి కొళాయిల ఏర్పాటు, రింతాడ పాతవీధిలో డ్రైనేజీ నిర్మాణం, మంచినీటి బోరు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరభన్నదొర, సీనియర్ టీడీపీ నాయకుడు సంజీవరావు, రంగారావు కలిసి అధికారులకు వినతి సమర్పించారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.




## ఆశ్రమ విద్యార్థులకు "పఠన నైపుణ్యాల" పెంపు మహిళల భద్రతపై అవగాహన...!

**సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఎస్ ఐ కిషోర్ వర్మ.**




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 7:** ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినీలు ప్రధానంగా పఠన నైపుణ్యాల పెంపు మరియు మహిళల భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఎస్ ఐ కిషోర్ వర్మ లు అన్నారు. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం హెచ్ ఎం సత్యవతి, సి ఐ శ్రీనివాసరావు ఎస్ ఐ కిషోర్ వర్మ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు స్కూల్ లో అభ్యాసన కార్యక్రమంలో పలు అంశాలపై సుదీర్ఘంగా తెలియజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, న్యూస్ పేపర్లు చదివించారు. బాగా చదివిన విద్యార్థులను సి ఐ, ఎస్ ఐ లు ఆనందించారు. అనంతరం సి ఐ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళల భద్రతపై సంధించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలు హెచ్ ఎం. పలువురు ఉపాషయ్యులు పాల్గొన్నారు.

## రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**మండలంలోని మొండిగడ్డ రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీపీ బోయిన కుమారి కూటమి నాయకుల సమక్షంలో విత్తనాలను అందజేశారు. రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బాలన్న, సిందేరి నారాయణరావు, కూటమి నాయకుడు అడపా సత్తిబాబు, గ్రామ పెద్దలు గబులంగి హరిబాబు, గబులంగి జోగిదొర, బోయిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గవానిపాలెం లో శ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం కు 50,000యాభైవేలు విరాళం



**గాజువాక :పెన్ పవర్, సెప్టెంబర్ 07** దుర్గవానిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం లో ముందుగా తిప్పల వంశి రెడ్డి దర్శనం చేసుకుని గుడి నిర్మాణం కొరకు 50,000 అక్షరాల యాభైవేలు రూపాయలు విరాళాలు 74 వ వార్డు మాజీ కార్పొరేటర్ తిప్పల వంశి రెడ్డి గ్రామ కమిటీ కి అందజేయడం జరిగినది గతంలో కూడా గుడి నిర్మాణం కొరకు 50,000 యాభైవేలు తిప్పల వంశి రెడ్డి ఇవ్వడం జరిగినది మొత్తం విరాళాలు 100000 అక్షరాల లక్ష రూపాయలు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షులు గంట్యాడ గురుమూర్తి కి ఇవ్వడం జరిగినది వంశి రెడ్డి మాట్లాడుతూ ఆ శివుని ఆశీస్సులు. దీవెనలు గ్రామశీలో ఉన్న ప్రజలందరి పైన ఉండాలని ప్రజలందరూ ఆయురా. ఆరోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ మరియు మహిళలు యువకులు పాల్గొన్నారు

# బోరు వేశారు - మోటారు మరిచారు



- సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉన్న బోరు బావి.
- పట్టించుకోని సంబంధిత అధికారులు.
- కెందుగూడ గ్రామస్తులు వంతాల జగన్నాథం, వంతాల వెంకటరావు, కిల్లో డోంబ్రు, వంతాల నీలకంఠం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 07.**మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ మారుమూల కెందుగూడ గ్రామంలో తాగునీటి అవసరాల కోసం అధికారులు బోరు బావిను తవ్వించి, ఆ తర్వాత మోటార్లు బిగించకుండా, వాటిని అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేసారని గ్రామస్తులు వంతాల జగన్నాథం, వంతాల వెంకటరావు, కిల్లో డోంబ్రు, వంతాల నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ.. గ్రామంలో 35 కుటుంబాలుగా 150 మంది జనాభా కలిగి ఉన్నామని, గ్రామంలో బోరు బావి తవ్వి వదిలేయడం వల్ల అది సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉందని, దీంతో గ్రామస్తులు ఊట గెడ్డ నీరే త్రాగునీరుగా వినియోగిస్తున్నామన్నారు. గ్రావిటీ నీటిని తప్పని పరిస్థితుల్లో త్రాగునీరుగా వాడుతున్నామని, దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బోరు బావిలో మోటారు బిగించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై మండల ప్రజా పరిషత్ అధికారి స్పందించాలని, లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో బోర్లు వేసినా, అవి ప్రజలకు ఉపయోగపడకుండా వృథాగా మారుతున్నాయన్నారు. తక్షణమే



సంబంధిత అధికారులు స్పందించి బోరుబావిని అందుబాటులో తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో వంతాల సూరమ్మ, కిలో గురుబరి, వంతాల ప్రసాద్, వంతాల జోగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.




## గొడిచింత సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వినతి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**గూడెం కొత్త వీధి మండలం రింతాడా పంచాయతీ గొడిచింత గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి కొయ్యం ఇమ్మానుయేల్ కోరారు. సోమవారం రింతాడలో నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీవో రమణబాబు, తహశీల్దార్ అన్నాజీరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన చెరువు పూడుకుపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెరువుకు పూడికతీత చేపట్టి, గ్రామంలోని ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఇమ్మానుయేల్ కోరారు.

# డాలిగుమ్మడి లో ఘనంగా వినాయక చవితి. పనులు ప్రారంభం.

వినాయక చవితి పందిరి. రాటవేసిన కమిటీ సభ్యులు.



**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 7 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం దాలిగుమ్మడి గ్రామంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు పాంగి అనిల్ అధ్యక్షతన. వినాయక చవితి సందర్భంగా తొలిరాటను వేశారు కమిటీ సభ్యులు గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలతో అభివృద్ధి చెందాలని. వినాయకుడిని ప్రార్థిస్తూ తొలిరాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గాలి గుమ్మడి వినాయక చవితి ఉత్సవ కమిటీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవరాత్రులు నిర్వహిస్తామని ప్రతిరోజు దీప నైవేద్యాలతో వినాయకుడి పూజలు అందుకుంటారు అని అన్నారు అంతేకాకుండా దూర ప్రాంతాల నుండి వచ్చే వారందరికీ కూడా వారి వారి గోత్రం నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమా ఉత్సవ కమిటీ అధ్యక్షులు విష్ణు కమిటీ సభ్యులు చిన్నయ్య తిలక్ ఆనందు బంటి హేమంత్ సూర్యచంద్ర దాలిగుమ్మడి ఆడపడుచులు చిట్టమ్మ లక్ష్మీ కళావతి సుభద్ర ప్రేమ సుందరి కాంతమ్మ మరియు గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

## విశాఖ టీడీపీలో మేయర్ రేసు - తెరపైకి ఒమ్మి సన్యాసిరావు పేరు

- 1995 నుంచి పార్టీకి విధేయుడు.. యాదవ సామాజిక వర్గంలో బలమైన నేత
- 2026 జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ బరిలోకి దిగేందుకు సిద్ధం




**విశాఖ తూర్పు,పెన్ పవర్ సెప్టెంబర్ 7:** విశాఖ మహానగర మేయర్ పీఠం కోసం తెలుగుదేశం పార్టీ నుండి మరో బలమైన పేరు తెరపైకి వచ్చింది. ఆ పేరే ఒమ్మి సన్యాసిరావు. జీవీఎంసీ ఎన్నికలు 2026 నేపథ్యంలో పార్టీ అధిష్టానం, నగర ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్న ఆయన ప్రొఫైల్ ఇదే..

మూడు దశాబ్దాల నమ్మకమైన ప్రస్థానం:

టిడిపి నగర అధ్యక్షులు సుందరం పాత్రుడు, జహీర్ అహ్మద్, రెహ్మాన్, వాసుపల్లి గణేష్ కుమార్ పల్లా శ్రీనివాస్, చోడె పట్టాభి. మొదలగువారితో పనిచేసిన అనుభవం, 1996 మున్సిపల్ మినిస్టర్ బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో తోటగరువులో జరిగిన భారీ బహిరంగ సభ ద్వారా టీడీపీలోకి అడుగుపెట్టిన ఒమ్మి సన్యాసిరావు,అప్పటి నుండి పార్టీకి విధేయుడిగా కొనసాగుతున్నారు.

ఉమ్మడి పెందుర్తి నియోజకవర్గంలో సీపీఎం హవా ఉన్న సమయంలో టీడీపీకి పునాది వేసిన నాయకుల్లో ఆయన ఒకరు. పెందుర్తి నుండి పీజీవీఆర్ నాయుడు (గణబాబు), అడివివరం పంచాయతీ నుండి పాసర్ల ప్రసాద్ విజయాల వెనుక ఆయన కృషి ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే టీడీపీ మేయర్ అభ్యర్థి పసుపులేటి ఉమాబాల గెలుపు కోసం నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీ ఎం వి వి ఎస్ మూర్తి,సూరెడ్డి,కొల్లి ధనలక్ష్మి,పల్లా సింహాచలం. మొదలగు వారితో కలిసి పనిచేసిన అనుభవం.

తూర్పు నియోజకవర్గ గెలుపులో కీలకపాత్ర:

2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏర్పడిన విశాఖ తూర్పు నియోజకవర్గంలో 2009, 2014, 2019, 2024లలో వెలగపూడి రామకృష్ణబాబు వరుస విజయాల వెనుక యాదవ సామాజిక వర్గం నుండి అందించిన మద్దతులో ఒమ్మి సన్యాసిరావు పాత్ర కీలకం. విశాఖ నగర, జిల్లా స్థాయిలో యాదవ సామాజిక వర్గానికి బలమైన నాయకుడిగా ఎదిగి రాష్ట్ర, జిల్లా, నగర స్థాయి పదవులు నిర్వహించారు.

ప్రజా సమస్యలపై పోరాటం:

స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నేతగా తోటగరువు ఉన్నత పాఠశాల అభివృద్ధి, మురికివాడలలో మురికివాడ సూర్య తేజా నగర్ జే ఎన్ ఎన్ యు ఆర్ ఎమ్ గృహ సముదాయ నిర్మాణానికి,బీఆర్టీఎస్ నిర్వాసితుల సమస్య పరిష్కారం,శ్రీకాంత్ నగర్, తోటగరువు గ్రామాల అభివృద్ధి కోసం అనేక ఉద్యమాలు చేపట్టారు.

కార్పొరేటర్ గా అనుభవం:

జీవీఎంసీ 50 నుండి 72 వార్డులుగా విస్తరించిన తర్వాత 2007లో జరిగిన ఎన్నికల్లో 2వ వార్డు నుండి టీడీపీ తరపున పోటీ చేసి కార్పొరేటర్ గా ఘన విజయం సాధించారు.

ఇద్దరు కుమారులు, భార్యతో స్థిరమైన కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిపుష్టి, బలమైన సామాజిక వర్గ మద్దతు, మూడు దశాబ్దాల పార్టీ విధేయత ఉన్న ఒమ్మి సన్యాసిరావును మేయర్ అభ్యర్థిగా బరిలోకి దింపితే నగరంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని శ్రేణులు భావిస్తున్నాయి.

పార్టీ అధిష్టానం ఆదేశిస్తే 2026 జీవీఎంసీ మేయర్ గా పోటీ చేసేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

# అక్రమ నిర్మాణానికి అధికారులు 'కన్నం' చేశారే...

## ఎపిసోడ్ - 1

- అలాగే ఆ కన్నం పూడ్చే మార్గం చెప్పండి..!
- నాలుగు యూనిట్ల పర్మిషన్... ఎనిమిది యూనిట్ల నిర్మాణమా?
- మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణానికి చిన్న 'కన్నం'తోనే సరిపెట్టిన ఈస్ట్ జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు..?
- ప్లాన్‌కు మించి అదనపు నిర్మాణం జరిగిందా?
- అక్రమమైన నిర్మాణానికి చిన్న కన్నం చేసి... పెద్ద చర్యగా చెప్పుకుంటున్న ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్..!
- కన్నం కొట్టక ముందు ఒక తీరు... తర్వాత మరో తీరా?
- చర్యలు ఎందుకు అర్థాంతరంగా ఆగిపోయాయి?
- అవినీతి ఆరోపణలు... సమగ్ర విచారణకు డిమాండ్!







**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ , విశాఖపట్నం, సెప్టెంబర్ 07:** విశాఖపట్నంలోని నగరం నడిబొడ్డున మద్దిలపాలెంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న ఓ నిర్మాణ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ, ఆ చర్యల తీరు ఇప్పుడు మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది.

భారీ స్థాయిలో ప్లాన్ ఉల్లంఘనలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్న నేపథ్యంలో, పూర్తి స్థాయి చర్యలకు బదులుగా నిర్మాణంలో కేవలం ఒకచోట చిన్న కన్నం పెట్టి వ్యవహారాన్ని ముగించడానికి ప్రయత్నించారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. "చిన్న కన్నం పెట్టడమే అక్రమ నిర్మాణంపై చర్యా?" అంటూ స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో అసలు ఏం జరిగింది? ఎన్ని యూనిట్లకు అనుమతి ఉంది? వాస్తవంగా ఎన్ని యూనిట్లు నిర్మించారు? ప్లాన్‌కు విరుద్ధంగా ఎంత మేర నిర్మాణం జరిగింది? అధికారులు గుర్తించిన ఉల్లంఘనలు ఏమిటి? వాటిపై తీసుకున్న చర్యలు ఎంత వరకు సమర్థవంతంగా ఉన్నాయి? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు రావాల్సి ఉంది.

నాలుగు యూనిట్లకు అనుమతి... ఎనిమిది యూనిట్ల నిర్మాణమా?

అందుబాటులో ఉన్నట్లు చెబుతున్న పర్మిషన్ ప్లాన్ ప్రకారం సదరు నిర్మాణానికి నాలుగు డ్వెల్లింగ్ యూనిట్లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే, వాస్తవంగా అక్కడ ఎనిమిది యూనిట్ల నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. అనుమతించిన యూనిట్ల కంటే రెట్టింపు సంఖ్యలో యూనిట్లు నిర్మించారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణాన్ని ఏ దశలో పరిశీలించారు? పరిశీలించి ఉంటే ఉల్లంఘనలు అప్పుడే ఎందుకు గుర్తించలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు స్పందించలేదా? లేక నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చిన తర్వాత మాత్రమే తనిఖీలు జరిగాయా? అన్న అంశాలు కూడా స్పష్టత రావాల్సి ఉంది.

### ప్లాన్‌కు మించి అదనపు నిర్మాణమన్న విమర్శలు

కేవలం యూనిట్ల సంఖ్య మాత్రమే కాకుండా, అనుమతించిన ప్లాన్‌కు మించి అదనపు నిర్మాణం కూడా జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవనం నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లు, ఫ్లోర్ ఏరియా, యూనిట్ల విభజన, అదనపు నిర్మాణాలు వంటి అంశాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా? అనే విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఒకవేళ ప్లాన్ ఉల్లంఘనలు జరిగాయని అధికారులు నిర్ధారించి ఉంటే, చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ఆ చర్యల్లో భాగంగానే కేవలం చిన్న కన్నం పెట్టారా? లేక పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని పరిమితం చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### చిన్న కన్నం... పెద్ద చర్యగా ఎలా మారింది?

ఇదే ఇప్పుడు ఈ వ్యవహారంలో ప్రధాన ప్రశ్నగా మారింది. స్థానికుల ఆరోపణల ప్రకారం భారీ స్థాయిలో నిర్మాణ ఉల్లంఘనలు జరిగి ఉంటే, కేవలం నిర్మాణంలో ఒకచోట చిన్న కన్నం పెట్టడమే పూర్తి చర్యగా ఎలా పరిగణిస్తారు? అధికారులు చర్యలు తీసుకున్నామని చెప్పడానికి మాత్రమే ఈ చర్య జరిగిందా? లేక చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించారా? అనే అంశంపై స్పష్టత అవసరమని స్థానికులు చెబుతున్నారు. "నాలుగు యూనిట్ల పర్మిషన్ ఉంటే ఎనిమిది యూనిట్లు ఎలా వచ్చాయి? అదనపు నిర్మాణం జరిగితే దానిపై చర్య ఏమిటి? కేవలం ఒక చిన్న కన్నం పెట్టడం ద్వారా మొత్తం వ్యవహారం ముగిసిపోయినట్టేనా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### కన్నం కొట్టక ముందు ఒక తీరు... తర్వాత మరో తీరా?

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని మొదట కఠినంగా వ్యవహరించినట్లు కనిపించిన అధికారులు, అనంతరం తీసుకున్న చర్యలపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చిన సమయంలో అధికారులు చూపిన స్పందన ఒకలా ఉండి, తర్వాత చర్యల విషయంలో మాత్రం మరోలా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చర్యలు ప్రారంభించిన తర్వాత పూర్తి స్థాయిలో ఎందుకు కొనసాగించలేదు? నిర్మాణాన్ని పూర్తిగా పర్మిషన్ ప్లాన్‌తో పోల్చారా? ఎంత మేర ఉల్లంఘన జరిగిందో అధికారికంగా నిర్ధారించారా? అలా నిర్ధారించినట్లయితే, ఆ వివరాలను ప్రజలకు ఎందుకు వెల్లడించలేదు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు.

### అసలు వ్యవహారం వెనుక ఏం జరిగింది?

ఈ నిర్మాణంపై వివిధ స్థాయిల్లో అధికారులు తనిఖీలు చేశారా? చేసి ఉంటే ఆ తనిఖీలు ఎప్పుడు జరిగాయి? ఎవరు నిర్వహించారు? తనిఖీల్లో ఎలాంటి ఉల్లంఘనలు గుర్తించారు? అనే అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. ప్లానింగ్ సెక్రటరీ స్థాయి నుంచి టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల వరకు ఈ వ్యవహారంపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉంది? ఫిర్యాదులు అందాయా? నోటీసులు జారీ చేశారా? నిర్మాణదారునికి వివరణ కోరారా? అన్న వివరాలు కూడా బయటకు రావాల్సి ఉంది. ఉల్లంఘనలు గుర్తించిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోతే దానికి కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### చర్యలు ఎందుకు అర్థాంతరంగా ఆగిపోయాయి?

ఇది ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్నగా మారింది. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని అధికారులు భావించి చర్యలు ప్రారంభించి ఉంటే, ఆ చర్యలు పూర్తిస్థాయిలో ఎందుకు కొనసాగలేదన్నది ఇప్పుడు అనుమానాలకు కారణమవుతోంది. కేవలం చిన్న భాగాన్ని మాత్రమే తొలగించడం ద్వారా అధికారుల చర్యలు ముగిశాయా? మిగిలిన నిర్మాణం చట్టబద్ధమైనదని అధికారులు నిర్ధారించారా? లేదా ఉల్లంఘనలపై పూర్తి స్థాయి పరిశీలన జరగకముందే చర్యలు నిలిచిపోయాయా? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### అవినీతి ఆరోపణలు... విచారణకు డిమాండ్

చర్యలు పరిమితంగా ఉండడంపై స్థానికుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు స్థానికులు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులపై అవినీతి, అక్రమ లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలను వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. ఎవరిపై ఆరోపణలు వచ్చాయి? వారు ఈ నిర్మాణంపై ఎప్పుడు చర్యలు తీసుకున్నారు? ఎలాంటి రికార్డులు పరిశీలించారు? నిర్మాణంలో ఎంత మేర ఉల్లంఘనలు జరిగాయని గుర్తించారు? తీసుకున్న చర్యలు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అన్న అంశాలపై స్వతంత్రంగా విచారణ జరిపితేనే నిజం బయటకు వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### చిన్న కన్నంతో పెద్ద అక్రమం మాఫీ అయినట్టేనా?

నాలుగు యూనిట్ల అనుమతితో ఎనిమిది యూనిట్ల నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు నిజమైతే, అది సాధారణ అంశం కాదని స్థానికులు పేర్కొంటున్నారు.అదే సమయంలో అదనపు నిర్మాణాలు కూడా జరిగాయని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, కేవలం ఒకచోట చిన్న కన్నం పెట్టడం ద్వారా మొత్తం వ్యవహారానికి ముగింపు పలకడం సరైనదేనా? అన్న ప్రశ్న వినిపిస్తోంది."అక్రమ నిర్మాణం జరిగితే చిన్న కన్నం పెట్టి కేసు ముగించడం కాదు... మొత్తం నిర్మాణాన్ని అనుమతి ప్లాన్‌తో పోల్చాలి. ఎంత మేర ఉల్లంఘన జరిగిందో స్పష్టంగా తేల్చాలి. చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అంతేకాకుండా, చర్యలు ఎందుకు మధ్యలోనే ఆగిపోయాయో కూడా విచారణ జరిపి ప్రజలకు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

### పర్మిషన్ ప్లాన్‌ను బహిర్గతం చేయాలి

ఈ వివాదానికి ముగింపు పలకడానికి సంబంధిత అధికారులు అధికారిక పర్మిషన్ ప్లాన్, నిర్మాణ తనిఖీ నివేదిక, ఉల్లంఘనల వివరాలు, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యల వివరాలను బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలా చేస్తేనే వాస్తవంగా ఎన్ని యూనిట్లకు అనుమతి ఉంది? ఎంత మేర నిర్మాణం జరిగింది? ఉల్లంఘనలు ఉన్నాయా? ఉంటే వాటిపై ఏ చర్యలు తీసుకున్నారు? అన్న అంశాలు స్పష్టమవుతాయని చెబుతున్నారు. అధికారులు కూడా ఈ ఆరోపణలపై స్పందించి తమ వైఖరిని వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ఇప్పుడు అందరి దృష్టి అధికారుల సమాధానంపైనే...

మొత్తానికి మద్దిలపాలెం నిర్మాణ వ్యవహారంలో ఇప్పుడు ఒకటే ప్రశ్న ప్రధానంగా వినిపిస్తోంది... "చిన్న కన్నం పెట్టారు కాబట్టి చర్యలు తీసుకున్నట్టేనా... లేక ఆ కన్నం వెనుక ఇంకేదైనా కథ ఉందా?" స్థానికుల ఆరోపణలు, పర్మిషన్ ప్లాన్‌కు సంబంధించిన ప్రశ్నలు, చర్యలపై నెలకొన్న సందేహాలు అన్నింటికీ సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణం జరిగిందా లేదా అన్నది అధికారిక రికార్డులు, తనిఖీలు, పర్మిషన్ ప్లాన్ ఆధారంగా తేలాలి. ఒకవేళ ఉల్లంఘనలు జరిగాయని నిర్ధారణ అయితే, చట్టప్రకారం సమగ్ర చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పెన్ పవర్ ప్రత్యేక కథనం -- కొనసాగుతుంది...

ఎపిసోడ్ -- 2లో మరిన్ని కీలక అంశాలు...

ఈ వ్యవహారంలో అసలు నిజాలేమిటి?

నిర్మాణ అనుమతుల్లో ఏముంది?

వాస్తవ నిర్మాణం ఎంత?

చర్యలు ఎందుకు పరిమితమయ్యాయి?

ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం...చదువుతూనే పెన్ పవర్

# మేయర్ పీఠం యాదవులకే ఇవ్వాలి



కూటమి నాయకత్వాన్ని కోరిన యాదవ సంఘాలు, కూటమి నేతలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 07 :** రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి అవకాశం కల్పించాలని యాదవ సంక్షేమ సంఘం, కూటమి యాదవ నాయకులు డిమాండ్ చేశారు. మేయర్ పదవితో పాటు వార్డు స్థాయిలోనూ యాదవులకు తగిన సంఖ్యలో కార్పొరేటర్ టికెట్లు కేటాయించాలని కోరారు.రాంనగర్‌లోని ఓ హోటల్‌లో జిల్లా సంఘం నాయకుడు వియ్యపు సత్యనారా యణమూర్తి (మూర్తి యాదవ్) అధ్యక్షతన ఆదివారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు అక్రమాని వెంకట్రావు, యాదవ ఉద్యో గుల సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రగాఢ చిన్నారావు తదితరు లు మాట్లాడారు.ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వెనుక బడిన తరగతుల్లో యాదవులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. విశాఖ జిల్లాలోనే మూడు లక్షలకు పైగా యాదవ ఓటర్లు ఉన్నందున జనాభా నిష్పత్తికి అనుగు ణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత కూట మిపై ఉందన్నారు.ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను కలిసి త్వరలో వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మేయర్ అభ్యర్థిత్వంతో పాటు గణనీయమైన సంఖ్యలో కార్పొరేటర్ స్థానాలను యాదవులకు కేటాయించా లని కూటమి అధిష్ఠానాన్ని కోరారు.యాదవులకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి విజయానికి మరింత బలం చేకూరుతుందని వారు అభిప్రా యపడ్డారు. గత శాసనసభ ఎన్నికల్లో గాజువాక నుంచి పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లే, రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లోనూ యాదవులు ఐక్యంగా పనిచేసి కూటమి విజయానికి కృషి చేస్తారని స్పష్టం చేశారు.

జీవీఎంసీ మేయర్ పదవికి యాదవ సామాజిక వర్గానికి అవ కాశం ఇవ్వడంతో పాటు అధిక సంఖ్యలో కార్పొరేటర్ స్థానా లను కేటాయించాలని కూటమి నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు బొట్టా వెంకటరమణ, సారిపల్లి గోవింద్, గొలగాని వీరారావు బుజ్జి, ఊరుకూటి నారాయణ, యాదవ సంఘం నాయకుడు గుంటుబోయిన రవికుమార్, కూటమి నాయకులు చల్లా ఈశ్వరరావు, గంగళ్ల అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, గొలగాని పోలరావు, మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్, గొంప గోవింద, కంచరపాలెం యాదవ సంఘం అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి -- దొంగతనాలకు పాల్పడవద్దు



-యాపిల్ ఐ ... స్కూల్‌లో క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమం

**గాజువాక:పెన్ పవర్, సెప్టెంబర్ 07:** విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ , డీసీపీ లతా మాధురి , ఏడీసీపీ , ఏసీపీ క్రైమ్స్ వెంకట్రావు ఆదేశాల మేరకు, సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జీ.డి. బాబు ఆధ్వర్యంలో గాజువాకలోని యాపిల్ ఐ స్కూల్ నందు విద్యార్థిని, విద్యార్థులకు క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులకు దొంగతనాల నివారణ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత మరియు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చెడు స్నేహాలు మరియు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేసుకొని చదువుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రులు బైక్‌లు లేదా సెల్‌ఫోన్లు కొనివ్వడం లేదనే కారణంతో ఇతరుల బైక్‌లు, సెల్‌ఫోన్లు దొంగతనం చేసి వాటిని కొనుగోలు చేయడం వంటి తప్పుదారులు పట్టే అవకాశం ఉందని, అలాంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకూడదని హెచ్చరించారు. చిన్న తప్పు కూడా భవిష్యత్తును నాశనం చేసే స్థాయికి తీసుకెళ్లవచ్చని విద్యార్థులకు వివరించారు.

మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయానికి పాల్పడుతున్నట్లు తెలిసినా, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే తల్లిదండ్రులకు తెలియజేసి పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన, స్నేహితులు, సెల్‌ఫోన్ వినియోగం మరియు వారి రోజువారీ కార్యకలాపాలను గమనిస్తూ వారికి మంచి మార్గనిర్దేశం చేయాలని కోరారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని వివరించారు.

విద్యార్థులు పోలీసులకు సహకరిస్తూ తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలని, తద్వారా దొంగతనాలు మరియు ఇతర నేరాలను ముందుగానే అరికట్టేందుకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యాపిల్ హై స్కూల్ ప్రిన్సిపల్ బలరాం కృష్ణ , హెడ్ కానిస్టేబుల్ , కానిస్టేబుల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** నూతన పెన్షన్ల కోసం ప్రభుత్వం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుదారులకు సచివాలయ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని దామనాపల్లి పంచాయతీకి చెందిన కూటమి నాయకులు కోరారు.దామనాపల్లి సచివాలయాన్ని సందర్శించిన నాయకులు నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న అర్హుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది సౌమ్యంగా వ్యవహరిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి దరఖాస్తు ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, పీసా సభ్యుడు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఆర్. లక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ బేరా సింహాచలం, మహిళా పోలీస్ రమణమ్మతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ కు డిజిటల్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు...!



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 7:** కొత్త పెన్షన్లు దరఖాస్తు చేసుకోవడానికి ఎంతో ఆశతో వెళ్లి తిరిగి వస్తున్న వైనం. మండలంలోని ఎం మాకవరం పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్ లేక పెన్షన్ అప్లై చేసుకునే వాళ్ళు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మెటర్నరీ లీవ్ పై వెళ్లడంతో ఇక్కడ ఉన్న పోస్ట్ ఇంకా భర్తీ కాలేదు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అప్లై చేసుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ పెన్షన్ దారుల్లో నిరాశ కలుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి మరి ఎవరినైనా ఇన్చార్జిగా నియమించాలని గ్రామస్తులు, పెన్షన్ దారులు కోరుతున్నారు

## డోర్ టు డోర్ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు



**గాజువాక :పెన్ పవర్, సెప్టెంబర్ 07 :**జీవీఎంసీ 66వ వార్డులో డోర్ టు డోర్ సమగ్రత సర్వేలో కైలాష్ నగర్ ప్రాంతంలో పార్టీ సీనియర్ నాయకులు బూతు కన్వీనర్స్, తెలుగుదేశం మహిళా నాయకులు, వార్డ్ అధ్యక్షులు, వార్డు క్లస్టరు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, మొత్తం డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు . కొన్ని బూతులు నాలుగు ఐదు రోజుల్లో వార్డులో కంప్లీట్ చేయుటకు, ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో జరుగుతున్న ఈ సమగ్రత సర్వే ని విజయవంతం చేస్తూ ప్రతి ఒక్కరూ సమస్యలు తెలుసుకోవడానికి ఇంత మంచి కార్యక్రమాన్ని 45 రోజులకి కోటి మంది కుటుంబాల్ని కలిసి అభివృద్ధి సంక్షేమం సమపాలుగా అందిస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అలాగే యువత సపోర్టు నాయకులు ఇచ్చే భరోసాని ప్రజలు ఎంతో మంచిగా స్వాగతిస్తున్నారు,

ఈ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుంది కూటమి ప్రభుత్వాన్ని ఇలాగే కొనసాగించాలని ఆదరిస్తున్న ప్రజానీకానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇందిరానగర్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన నాయకులు బెహరా భాస్కరరావు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 7 :** శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇందిరానగర్‌లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బెహరా భాస్కరరావు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, కంపర కోటీశ్వరరావు, గొంతిన నాగరాజు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, ఇల్లపు సురేష్, మనోహర్, ఒమ్మి శ్రీనివాసరావు, నూనెల శ్రీను, పీతల ఈశ్వరరావు, నూనెల రాజేంద్ర, ఎ. అప్పలనాయుడు, నూనెల నాయుడు, నూనెల అర్జున్ రావు, నూనెల కాంతారావు, కోళ్ల వెంకటరావు, ఎ. చిన్నారావు తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇందిరానగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణకు జనసేన ఏర్పాట్లు

- సెప్టెంబర్ 8 నుంచి 16 వరకు మూడు ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ
- లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి: బెహరా భాస్కరరావు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ :** కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జనసేన పార్టీ విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ నాయకులు బెహరా భాస్కరరావు తెలిపారు. సెప్టెంబర్ 8, 2026 నుంచి సెప్టెంబర్ 16, 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో కొత్త పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. 91వ వార్డుకు సంబంధించి గోపాలపట్నం మెయిన్ రోడ్డులో స్టేట్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ కేంద్రాన్ని గునిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 92వ వార్డుకు సంబంధించి వెంకటాపురం మూడు గుళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ కేంద్రం ధవళ గోపాల్ ఆధ్వర్యంలో కొనసాగనుంది. 89వ వార్డుకు సంబంధించి చంద్రనగర్ రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని గేదెల మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కొత్తగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెహరా భాస్కరరావు కోరారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన శ్రేణులకు ఆయన సూచించారు.

# తొలి వెయ్యి రోజుల్లో పోషకాహారమే కీలకం

- పోషకాహార లోపాన్ని నివారించేందుకు తల్లుల్లో అవగాహన పెరగాలి
- కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 07 :** గర్భధారణ నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తొలి వెయ్యి రోజులు శారీరక, మానసిక ఎదుగుదలకు అత్యంత కీలకమై నవని కింగ్ జార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఐ. వాణి అన్నారు. ఈ కాలంలో అందించే సరైన పోషకాహారం ఆరోగ్య వంతమైన భవిష్యత్తుకు పునాది వేస్తుందని పేర్కొన్నారు.

ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జ్ ఆసుపత్రి పిల్లల వైద్య విభాగం, పోషకాహార పునరావాస కేంద్రం సంయుక్త ఆధ్వ ర్యంలో వారం రోజులుగా నిర్వహించిన జాతీయ పోషకాహార వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన డా. వాణి మాట్లాడుతూ పోషకాహారంపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సి న అవసరం ఉందన్నారు. వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన పిల్లల వైద్య విభాగం, పోషకాహార పునరావాస కేంద్రం బృందాలను అభినందించారు.ఈ సందర్భంగా పిల్లల వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ డా. బి.ఎస్. చక్రవర్తి మాట్లాడు తూ పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు కేవలం వారో త్సవాలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా కొనసాగా లని సూచించారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తల్లులు కుటుంబాల్లో ఆచరించడంతోపాటు ఇతర తల్లులకు కూడా తెలియజేయాలని కోరారు. ప్రతి తల్లికి సరైన పోషకా హారంపై అవగాహన కల్పించినప్పుడే పిల్లల్లో పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా నివారించగలమన్నారు.

విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ వారోత్సవాల్లో వైద్య విద్యార్థులు, పిల్లల వైద్య పీజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పిల్లల పోషకాహారంపై శిక్షణ ఇచ్చారు. ఆరు నెలల తర్వాత శిశు వులకు అందించాల్సిన అనుబంధ ఆహారం, వయస్సుకు తగిన ఆహారం, ఆహార వైవిధ్యం, సరైన ఆహారం అందించే విధానాలు, పోషకాహార లోపాన్ని ముందుగానే గుర్తించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.పోస్టర్ ప్రదర్శనలు, రంగోలి, ప్రశ్నోత్తర పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమాన్ని నోడల్ అధికారి, సహాయ ఆచార్యురాలు డా. అర్చన, పోషకాహార పునరావాస కేంద్రం వైద్యాధికారులు డా. మాధవి, డా. వినీల సమర్థవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య విభాగం ఆచార్యులు డా. రత్నకుమారి, డా. చౌదరి బాబు, సహ ఆచార్యుడు డా. సందీప్, సహాయ ఆచార్యులు డా. రమ్య, డా. గిరిధర, డా. శ్రీలత, డా. సింధూర, నర్సింగ్ సిబ్బంది, పోషకాహార పునరా వాస కేంద్రం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## “సచివాలయం.. ఆర్‌బీకే కనిపించవా?” ---

# వంశీకృష్ణపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి కనబడటం లేదా?



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెదవలస గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధిని విస్మరించి మాజీ సర్పంచ్ వంశీకృష్ణ విమర్శలు చేయడం సరికాదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు.వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) భవనాలే అప్పటి అభివృద్ధికి నిదర్శనాలని పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన వంశీకృష్ణ ప్రస్తుతం రాజకీయ లబ్ధి కోసం కూటమిలో చేరి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పంచాయతీకి వచ్చిన నిధులు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై వంశీకృష్ణ ప్రజలకు వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

# రింతాడ ప్రత్యేక పీజీఆర్‌ఎస్‌లో ఏబులం సమస్యలపై వినతులు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** రింతాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబులం పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పేసా కార్యదర్శి గబులంగి గణేష్, కూటమి నాయకుడు వంద్రంగి సత్యనారాయణ ఎంపీడీవో రమణబాబుకు వినతిపత్రం అందజేశారు.ఏబులం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అత్యవసరంగా పరిష్కార చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

## 46మంది రైతులకు పట్టదారు పాసు పుస్తకాల పంపిణీ

- పనసపుట్టు పంచాయితీ మాజీ సర్పంచ్ జనం నోయిన.
- పంచాయతీ విఆర్‌ఓ సిహెచ్ రమేష్. విఆర్‌ఎ ఈశ్వర్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 07.**మండలంలో గల పనసపుట్టు పంచాయతీ కేంద్ర గ్రామంలో 46 మంది రైతులకు వీఆర్వో సిహెచ్ రమేష్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ జనం నోయిన చేతుల మీదుగా భూ రీసర్వే పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోయిన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగనన్న ఆదేశాలతో బూ సర్వే చేసినట్లు ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వం మారటంతో రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు రాష్ట్ర కూటమి ప్రభుత్వం రెండున్నర ఏళ్ళుగా నిలిపివేసింది అన్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం భూమీ రీ సర్వే పట్టాలు పంపిణీ ముందుకు తెచ్చిందని ఆమె అన్నారు. భూ రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రతి గిరిజన రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ ఈశ్వరరావు, వైసీపీ నేత జనం తిరుపతి, వార్డు మెంబర్ జనం గోపాల్, రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల సంస్థాగత ఎన్నికలపై సమావేశం...

- కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గొర్ల చంటబ్బాయి..
- యువమోర్చా అధ్యక్షుడిగా వెలుపుల శివనాగ దుర్గ...



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 07:-** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షులు అద్రా వెంకన్నదొర స్వగృహంలో సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాబోయే సంస్థాగత ఎన్నికలు, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం తదితర అంశాలపై నాయకులు చర్చించారు.
ఈ సందర్భంగా మండలంలోని పార్టీ అనుబంధ విభాగాలకు నూతన బాధ్యతలను అప్పగించారు. మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గొర్ల చంటబ్బాయిని, యువమోర్చా అధ్యక్షుడిగా వెలుపుల శివనాగ దుర్గను నియమించినట్లు నాయకులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.రాబోయే సంస్థాగత ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మిడి లోవరాజు, సోమ సత్తిబాబు,కర్రి వీరబాబు, బాలిపల్లి చక్రి, సైపిరెడ్డి దొర తదితరులు పాల్గొన్నారు.


## ఆత్రేయపురం మండల ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి నూతన కమిటీలు ఎన్నిక






**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 7 :**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండల ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి నూతన మండల కమిటీలను సోమవారంఎన్నుకున్నారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి డాన్ సూరి మాదిగ, యార్లగడ్డ సత్తిబాబు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా లకారపు చంద్రశేఖర్ మాదిగ (వెలిచేరు), ఎం.ఎస్.పి మండల అధ్యక్షుడిగా లినేకూరి కృష్ణ మాదిగ (కట్టుంగ)లిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు నూతన కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు.
అనంతరం ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు పాతకోకల సారధి, కొల్లి వెంకటేశ్వర్లు, కొల్లి కనకంలను ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో ముప్పిడి పండు, రాచర్ల అరుణ్ కుమార్, యార్లగడ్డ డేవిడ్, యార్లగడ్డ సర్వరాయుడు, యార్లగడ్డ రమేష్, ఉందుర్తి వీర్రాజు, లంక ప్రేమ్ కుమార్, సిరిపెల్ల బాబి, పోసిపోయిన రాజు, దిరిసెన ఆంజనేయులు, కొల్లి విజయ్, చిర్రా సురేష్, కాకిలేటి రమేష్, వేమగిరి శేషు, యార్లగడ్డ కిరణ్, పోసిపోయిన రవి, యార్లగడ్డ సంజీవ్, మెరిపే నాగేశ్వరరావు, కొల్లి వీర్రాజు, కొల్లి కృపావరం, సవరపు యేసు, కొల్లి డేవిడ్, కొల్లి రాజు, కొల్లి మోసే, యార్లగడ్డ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా రవాణాపై పోలీసులు దాడి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 7:**అంబాజీపేట నుండి అక్రమంగా తరలిస్తున్న బాణాసంచా వాహనంపై అంబాజీపేట పోలీసులు దాడి చేసి సామాగ్రిని సీజ్ చేశారు. ఆదివారం రాత్రి సమాచారం అందడంతో అంబాజీపేట ఎస్ ఐ షేక్ సుభాని సిబ్బందితో వెళ్లి ఆటోలో తరలిస్తున్న 1400 తారాజువ్వలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 20వేలు రూపాయలు ఉంటుందని అంచనా. బాణాసంచా యజమాని కడలి వెంకట సూర్యనారాయణ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ ఐ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యకరమైన జీవనం

### వాయు కాలుష్య నియంత్రణకు సమష్టి కృషి అవసరం: కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 07 :** ఒక ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల అభివృద్ధితోపాటు పచ్చదనం పెంపొందించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య అన్నారు. పరిశ్రమల ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరగడం తోపాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వా ల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాయు నాణ్య తను పర్యవేక్షించే పరికరాల ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి ఏటా సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.స్వచ్ఛ వాయు దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిప ల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బీచ్‌రో డ్డులో పచ్చదనం కోసం నడక కార్యక్రమం నిర్వహించారు. కాళికామాత ఆలయం వద్ద ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ జస్మిత్ సింగ్ బింద్రా, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎస్‌పీఏ వైస్ చైర్‌పర్సన్ రోషిణి అపరంజి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ వేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

**కాలుష్య నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి**

కార్యక్రమం అనంతరం బీచ్‌రోడ్డులో వాయు కాలుష్య నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ నగరంలో వాయు నాణ్యత ను మెరుగుపరిచి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వ శాఖలు, పోర్టు, స్థానిక సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.యువత సామాజిక మాధ్యమాల ద్వారా వా యు కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వినూ త్న కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. చిన్న వీడియోలు, సం దేశాల ద్వారా కాలుష్య నియంత్రణపై చైతన్యం తీసుకురా వాలని సూచించారు.విశాఖపట్నం పోర్టు పరిధిలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని పోర్టు చైర్మన్ జస్మిత్ సింగ్ బింద్రా తెలిపారు. ధూళి కాలుష్యాన్ని నియంత్రించేం దుకు రవాణా వాహనాలను కప్పివేయడంతోపాటు, తరచూ నీటిని పిచికారీ చేస్తున్నామని చెప్పారు.వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలో విద్యుత్ బస్సుల సంఖ్యను పెంచు తున్నామని ఆర్టీసీ విశాఖ ప్రాంతీయ మేనేజర్ అప్పలనా యుడు తెలిపారు. పరిశ్రమలు కూడా కాలుష్య నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్ సూచించారు.భవనాల నిర్మాణం, కూల్చివేతల సమయంలో వెలువడే వ్యర్థాలు నగరంలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నిర్మాణ వ్యర్థాల ను సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడుతు న్నామని చెప్పారు.

**గాలి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ**

హార్బర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాన్ని కృష్ణయ్య ప్రారంభించా రు. ఈ కేంద్రం ద్వారా పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యతను నిరంతరం, తక్షణ ప్రాతిపదికన పర్యవేక్షించవచ్చని తెలిపారు. గాలిలోని సూక్ష్మ ధూళికణాలు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఓజోన్ వంటి కాలుష్య కారకాల స్థాయిలను నమోదు చేయవచ్చన్నారు.వాయు నాణ్యతలో మార్పులను గుర్తించడం, కాలుష్యానికి కారణమ య్యే వనరులను గుర్తించడం, నియంత్రణ చర్యలు చేపట్టడం ఈ కేంద్రం ద్వారా సాధ్యమవుతుందని వివరించారు. విశాఖ నగరంలో మరో మూడు వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**పరిశ్రమలతోపాటు పర్యావరణ పరిరక్షణ కు ప్రాధాన్యం**

స్వచ్ఛ వాయు దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యశాలలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించడంలో జిల్లా యంత్రాంగం ముందుంటుందని, అదే సమయంలో పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అభినంద నీయమని కలెక్టర్ అన్నారు.పర్యావరణ సమస్యలపై ఇటు వంటి కార్యశాలలు తరచూ నిర్వహించడం ద్వారా సమస్య లకు త్వరితగతిన పరిష్కారాలు కనుగొనవచ్చని తెలిపారు. వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా జీవీఎంసీ ఆధునిక స్వయంచాలక సంకేత వ్యవస్థను త్వరలో ఏర్పాటు చేయను న్నట్లు కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు.కార్యశాలలో నగరంలోని వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలు, ప్రస్తుతం అమలు చేస్తున్న నియంత్రణ చర్యలు, భవిష్యత్‌లో చేపట్టా ల్సిన కార్యాచరణపై నిపుణులు, అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు చర్చించారు. పౌరులు, స్వ చ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలకు త్వరి తగతిన పరిష్కారం చూపుతామని చైర్మన్ కృష్ణయ్య హామీ ఇచ్చారు.అనంతరం బీచ్‌రోడ్డు, విశాఖపట్నం పోర్టు పరిస రాల్లో అధికారులు మొక్కలు నాటారు. మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించి, పెద్ద వృక్షాలుగా ఎదిగేలా చూడాలని కృష్ణయ్య సూచించారు.
ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ముఖ్య పర్యావరణ ఇంజినీర్ శంకర్ నాయక్, ప్రాంతీయ కార్యాలయ అధికారి ముకుందరావు, జీవీఎంసీ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, పర్యావరణవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గీత కులాలకు సముచిత వాటా

- గీత కులాల ఐక్య వేదిక డిమాండ్ --
- మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 07 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన గీత కులాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని గీత కులాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. జివిఎంసీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో గీత కులాలకు కనీసం 20 శాతం సీట్లు కేటాయించాలని కోరింది.నగరంలోని పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐక్య వేదిక అధ్యక్షుడు సంపంగి శ్రీనివాస్, కార్యదర్శి అప్పారి గిరిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా శెట్టిబలిజ, యాత, గౌడ, ఈడిగ, శ్రీశయన తదితర గీత కులాలకు సుమారు 67 లక్షల జనాభా ఉందన్నారు. విశాఖ నగరంలోనే సుమారు మూడు లక్షల మంది ఉన్నప్పటికీ రాజకీయంగా తగిన ప్రాతి నిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో తమను ఓటు బ్యాంకుగా విని యోగించుకుని, అనంతరం విస్మరిస్తున్నాయని ఆరోపించారు.

**రిజర్వేషన్ ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకు అందాలి**

గీత కులాల ఆర్థికాభివృద్ధి కోసం మద్యం దుకాణాలు, బార్ల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వారు స్వాగతించారు. అయితే ఆ రిజర్వేషన్ ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో గీత కార్మికులకు అందడం లేదని ఆరోపించారు. బడా వ్యాపారులు, బినామీలు కేటాయింపుల ను చేజిక్కించుకుంటున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు.
ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం తాటి, ఈత చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు గతంలో అమలు చేసిన విధంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన అనంతరం పరిహారం బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సుమారు 300 బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గీత కార్మికులకు 45 ఏళ్ల వయస్సు నుంచే సామాజిక పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ప్రమాదాల నివారణకు అత్యా ధునిక రక్షణ బెల్టులు, మోటారైజ్డ్ రోప్ కార్ట్ వంటి పరికరాల ను ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాల్లో శాశ్వత వైకల్యం పొందిన గీత కార్మికులకు ఆర్థిక భద్రత కల్పిం చడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించా లని కోరారు.

**నీరా ఉత్పత్తులకు అనుమతులు ఇవ్వాలి**

తెలంగాణలో అమలవుతున్న తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ గీత కార్మికులు నీరా ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరా ఉత్పత్తుల తయారీ, విక్రయాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. ఉత్తరాం ధ్రలో అధిక సంఖ్యలో ఉన్న యాత, శ్రీశయన గీత కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.
ఈ సమావేశంలో ఐక్య వేదిక ప్రతినిధులు గొడ్డి కన్నారావు, వై. మధుగౌడ్, బమ్మిడి రమణ, తులసి పార్వతి, నెల్లి రాజు, ఎల్లమెల్లి సురేష్, పట్నాల నూకరాజు, కొప్పిశెట్టి కనకశేఖర్, కముజు రమణ, చెల్లుబోయిన గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# కట్టుపల్లిలో 89 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు




### రాజముద్రతో కూడిన పట్టాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ కట్టుపల్లి గ్రామంలో 89 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు పంపిణీ చేశారు. పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కూటమి నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు అందించిన పట్టాదారు పాసుపుస్తకాలను భద్రంగా ఉంచుకుని, ప్రభుత్వం కల్పించే వివిధ రకాల సౌకర్యాలు, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, పీసా గ్రామసభ సభ్యులు మాదిరి చంటిబాబు, బాలరాజు, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, కూటమి నాయకులు దుక్కెరి ప్రభాకర్, పల్లం నాయుడు, ఎం. సతీష్, మూర్తి, మాజీ సర్పంచులు కుందేరి రామకృష్ణ, పేతురు, వీఆర్వో తగ్గి రామారావు , మండల సర్వేయర్ ఆదినారాయణ, సర్వేయర్ బుజ్జిబాబు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ నల్లగొండ తల్లి ఆలయం పుర నిర్మాణ శంకుస్థాపన....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 07:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం జి కొత్తపల్లి గ్రామం లో వేంచేసి ఉన్న గ్రామం దేవత శ్రీశ్రీశ్రీ నల్లకొండమ్మ అమ్మవారు ఆలయాన్ని పునర్ నిర్మాణం చేపట్టడానికి ఆలయ ధర్మకర్తలు వారి కుమారులు శంకుస్థాపన చెయ్యడం జరిగింది. ఆలయం ధర్మకర్త ఈగల చిన్న బెన్నయ్య కుమారులు ఈగల వెంకట గిరి, ఈగల శివ మోహన్ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు మాజీ జడ్పీటీసీ ఈగల అప్పారావు, సర్పంచ్ ఈగల విజయదుర్గ రవికుమార్, ఈగల మాణిక్యాల రావు, ఈగల రాజారావు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆలయ పార్కింగ్‌లో బైక్‌ల చోరీ.. 11 వాహనాలు స్వాధీనం

- నిందితుడిని అరెస్ట్ చేసిన ఆత్రేయపురం పోలీసులు



**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 7:**ఆలయ పార్కింగ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆత్రేయపురం పోలీసులు సోమవారంఅరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఏకంగా 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని లొల్ల న్యూ బ్రిడ్జి వద్ద ఎస్ఐ ఎస్. రాము సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో రావులపాలెం వైపు నుంచి వేగంగా మోటార్ సైకిల్‌పై వచ్చిన ఓ వ్యక్తి పోలీసులను గమనించి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.
విచారణలో నిందితుడు అంబటి సత్యనారాయణ (49) గా గుర్తించారు. వాడపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పార్కింగ్ ప్రాంతంలో కొంతకాలంగా మోటార్ సైకిళ్లను చోరీ చేసి, వాటిని విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అతని సమాచారం మేరకు మొత్తం 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.కొత్తపేట డీఎస్పీ, రావులపాలెం రూరల్ సీఐ పర్యవేక్షణలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

# పరిమితడకలో ఇనుప ముళ్ళ కంచెలో చిక్కుకున్న ఎలుగుబంటి.







**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** మండలానికి చెందిన మర్రి వీడు పంచాయతీ పరిధి పరిమితడక గ్రామంలో ఇనుప ముళ్ళ కంచెలో ఆదివారం రాత్రి ఎలుగుబంటి పిల్ల చిక్కుకుంది. రైతు తన పొలం చుట్టూ రక్షణ కోసం నిర్మించిన ఇనుప ముళ్ళ కంచె లో చిక్కుకొని అరవడం ప్రారంభించింది. దీంతో విషయం గ్రహించిన స్థానికులు ఏలేశ్వరం రేంజ్ అధికారులకు తెలియపరిచారు. దీంతో అటవీ శాఖ ఏలేశ్వరం రేజ్ అధికారి దుర్గా రాంప్రసాద్ ఆధ్వర్యంలో హనుమాన్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, ఎలుగుబంటికి మత్తుమందు ఇచ్చి రవాణా బోనులోకి ఎక్కించారు. ఎలుగుబంటి పిల్లను విశాఖపట్నం ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్ కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# “సొంతంగా చేసిందేముంది? వైసీపీ పథకాలనే కాపీ కొడుతున్నారు” -- గిరిప్రసాద్ ఫైర్

**కూటమి నేతలకు వైసీపీ హయాంలో నిర్మించిన భవనాలు కనిపించడం లేదా?**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రతి పంచాయతీలో నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) భవనాలు కూటమి నేతలకు కనిపించడం లేదా అని వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ ప్రశ్నించారు.శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా గ్రామాల్లో కొత్తగా ఒక్క ప్రభుత్వ భవనం నిర్మించలేదని, కొత్తగా ఒక్క రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్డు పనుల్లో ఎక్కువ భాగం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించి మంజూరు చేసినవేనని పేర్కొన్నారు.అధికార దాహంతో కూటమి నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, సొంతంగా కొత్త ఆలోచనలు లేక వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాపీ కొడుతూ పాలన సాగిస్తున్నారని గిరిప్రసాద్ ఎద్దేవా చేశారు.



# వైసీపీ నేతలు గత పాలనపై సమాధానం చెప్పాలి

**కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి లేదనడం హాస్యాస్పదం: జనసేన నేత గొర్లె వీరవెంకట్**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని విమర్శిస్తున్న వైసీపీ నాయకులు ముందుగా తమ ఐదేళ్ల పాలనలో గిరిజన ప్రాంతాలకు చేసిన అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పాలని జనసేన నాయకులు గొర్లె వీరవెంకట్ డిమాండ్ చేశారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధులు, విధులు సక్రమంగా అందక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన ఆరోపించారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని సర్పంచులు ఆందోళనలు, నిరసనలు చేపట్టాల్సిన పరిస్థితి అప్పట్లో నెలకొందన్నారు. కేంద్రం నుంచి వచ్చిన పంచాయతీ నిధులను సైతం సక్రమంగా వినియోగించకుండా గ్రామీణ అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా ‘అడవి తల్లి బాట’ కార్యక్రమం ద్వారా మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే చర్యలు వేగవంతమయ్యాయని తెలిపారు.ఏళ్ల తరబడి డోలీ మోతలతో రోగులను తరలించాల్సిన పరిస్థితి ఉన్న గ్రామాలకు రహదారులు, మౌలిక వసతులు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.అదేవిధంగా గిరిజన యువత ఉద్యోగ అవకాశాలకు కీలకమైన జీఓ నంబర్--3 విషయంలోనూ వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని వీరవెంకట్ ప్రశ్నించారు. గిరిజన యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశాలపై అప్పట్లో ఎందుకు స్పందించలేదని నిలదీశారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో, ఎవరి పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయో పరిశీలించి తగిన తీర్పు ఇస్తారని గొర్లె వీరవెంకట్ అన్నారు. ప్రజలకు అన్నీ తెలుసని, మాటల నాయకులు ఎవరో.. అభివృద్ధి చేసే నాయకులు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.




# కట్టుపల్లిలో తహసీల్దార్ హెచ్. అన్నాజీరావుకు ఘన సన్మానం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**గూడెంకొత్తవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావుకు దామనాపల్లి పంచాయతీ కట్టుపల్లి గ్రామంలో ఘన సన్మానం జరిగింది. గ్రామంలో 89 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం అనంతరం స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న హెచ్. అన్నాజీరావును ఈ సందర్భంగా అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నందుకు ఆయనను సన్మానించినట్లు తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, పీసా గ్రామ కమిటీ సభ్యులు మాదిరి చంటిబాబు, బాలరాజు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, కూటమి నాయకులు దుక్కెరి ప్రభాకర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఇర్మియా, వీఆర్వో తగ్గి రామారావు, సర్వేయర్లు ఆదినారాయణ, బుజ్జిబాబు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# రింతాడ సచివాలయంలో పీజీఆర్ఎస్:దుచ్చరపాలెం సమస్యలపై వినతుల వెల్లువ




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబరు 7:** రింతాడ సచివాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో దుచ్చరపాలెం గ్రామ సమస్యలపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరారు. చెక్‌డ్యాంలో పేరుకుపోయిన పూడికను తక్షణమే తొలగించి, నీటి ప్రవాహానికి అనుగుణంగా డ్రైనేజీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామానికి 2,000 మీటర్లకు పైగా సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. రేషన్ డిపో భవనం, గ్రంథాలయ భవనం నిర్మాణంతో పాటు స్థానిక పాఠశాలకు వంట షెడ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. గ్రామ సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించడంతో పాటు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షుడు సాగిన భీమేశ్వర్ పడాల్,సాగిన లక్ష్మణరావు, జనసేన నాయకుడు బ్రహ్మాజీ పడాల్, గ్రామ ప్రముఖులు నారాయణ, సోమరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# “బీసీ”లకు మొండి చెయ్యి...!

- ఇచ్చిన హామీలు గాలి కి వదిలేసిన కూటమి ప్రభుత్వం...!
- బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అన్నారు అది ఎక్కడ...!
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న వైసిపి నేతలు



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబరు 7 :** కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అయ్యిందని అల్లూరి జిల్లా వైసీపీ పార్టీ ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గాడి నాగమణి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ మంజూరు చేస్తామని, ఇప్పుడు బీసీలకు మొండి చెయ్యి చూపించారని ఎన్నికల ముందు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని , కానీ ఇప్పుడు పెన్షన్ ఇవ్వకుండా మాట దాటేశారని వారు అన్నారు, ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే హామీలు ఇవ్వడం ఎందుకని వారు ప్రశ్నించారు, అలాంటప్పుడు చేతగాని తప్పుడుహామీలు ప్రలోభ ప్రజలకు పెట్టి, గద్దెనెక్కి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసం చేస్తుందని వారు దుయ్యబట్టారు.

# “ఆడాకులు” పంచాయతీలో ఇంటింటా ప్రచారం...!

- కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన ఎం.వి.వి.



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 7 :** ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం అని మాజీ జిసిసి చైర్మన్,రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఆడాకులు పంచాయతీలో ఇంటింటా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించి, అలాగే ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని,స్థానికంగా ఉన్న మౌలిక వసతులు,రహదారులు, తాగునీరు,విద్య, వైద్యం తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కార దిశగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఈనెల 9వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలి.

- రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 7:** ఈనెల 9వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు అంబాజీపేట మండల పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటనను కూటమి నాయకులందరూ విజయవంతం చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన అంబాజీపేట మండలం మాచవరంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం పలకాలని ఆయన నిర్వహించే సభలను, కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, పి. గన్నవరం టిడిపి కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, బిజెపి మండల అధ్యక్షుడు కురస ఆంజనేయులు, గణపతి వీర రాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు కొర్లపాటి ఢిల్లీ అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్ అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇవ్వనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు జగ్గంపేట మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో అప్లికేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో దరఖాస్తుల కోసం వస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల లబ్ధిదారులకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీను మణిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, టౌన్ టీడీపీ అధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారుల కోసం తాగునీరు, ఎండ తగలకుండా చలవ కోసం టెంట్లు, కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. ప్రతి అర్హుడికి పెన్షన్ అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, జగ్గంపేటలో ఒక్క అర్హుడు కూడా మిగిలిపోకుండా చూసే బాధ్యత తమదని స్పష్టం చేశారు.

## మండపం గ్రామంలో జనసేన ఉండకూడదు...జనసేన మాటే వినబడకూడదు అంటున్న పొలం చిన్న...

- దీనిపై పొలం వెంకట రత్నం ప్రెస్ మీట్ లో ఆరోపణ.....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 07:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం మండపం గ్రామంలో జనసేన నాయకుడు పొలం వెంకటరత్నం పాత్రికేయ మిత్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో మొన్న 2వ తారీఖున పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం జరిగింది. మండపం గ్రామంలో జనసేన ఫ్లెక్సీ పెట్టకూడదని అన్ని అన్నారు పొలం వెంకటరత్నం ఆరోపించారు మండపం విషయంపై ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా గ్రౌండ్ లో ఎంక్వయిరీ చేయించి మండపం లో జనసేన పార్టీ ఒకటి ఉందని కూటమి లో భాగంగా జనసేన పార్టీని గుర్తించాలని జనసేన నాయకులు కోరారు.

ఆ గ్రామ మహిళలు జనసేన పార్టీలో చేరాము అన్ని ఉపాధి హామీ పనిలోకి వెళ్లిన మీ పేరు రాలేదని అంటున్నారని కొండ్రు నూకాలమ్మ, మానుకొండ సత్యవతి ఆరోపించారు. మండపం గ్రామంలో జనసేన ఏ కార్యక్రమంలో ఆహ్వానించడం లేదని జనసేన పార్టీ ఈ గ్రామంలో ఉండకూడదని ఉంటే ఊర్లో బతకదేమో అని టిడిపి నాయకుడు పొలం చిన్న అంటున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా జనసేన పెద్దలు నాయకులు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని జనసేన నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పోలం వెంకటరత్నం, సుంకర వెంకటసూరి, పోలం పద్మా , గుండిబిల్లి నూకరాజు, చాగంటి రాజులు, చాగంటి అప్పారావు, సుంకర శివ, సిద్ధాంతపు శ్రీను, దార్ల శ్రీను, వేల్పుల నాగబాబు, వేల్పుల వరప్రసాద్, వేల్పుల దొంగబాబు, మానుకొండ నూకరాజు, చిట్టీమూరి చంటిబాబు, కొండ్రు నూకాలమ్మ, మానుకొండ సత్యవతి , పులుగు రాజులు ,నరుకుర్తి అప్పారావు, జనసేన కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీత డా. ప్రయాగ మూర్తి ప్రగడకు ఘన సత్కారం.

విద్యాబోధనతో పాటు కళాశాల అభివృద్ధి, విద్యార్థి సేవల్లో విశిష్ట సేవలు: ప్రిన్సిపాల్ డా. డి. సునీత.





**ఏలేశ్వరం, పెన్ పవర్ , సెప్టెంబర్ 7:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. ప్రయాగ మూర్తి ప్రగడ 2026 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికై, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2026 సెప్టెంబర్ 5న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ సమక్షంలో పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సునీత ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి. సునీత మాట్లాడుతూ, డా. ప్రయాగ మూర్తి ప్రగడ విద్యాబోధనను కేవలం ఉద్యోగ బాధ్యతగా కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయనకు లభించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడు పురస్కారం వ్యక్తిగత ప్రతిభకు లభించిన గౌరవమే అన్నారు. డా. ప్రయాగ మూర్తి కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి విద్యా అవసరాలు, వ్యక్తిగత సమస్యలు , అవసరమైన సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులకు సైతం తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థులకు అండగా నిలిచారని తెలిపారు.అలాగే ఆయన కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అకడమిక్ అఫైర్స్ ఆఫీసర్, ఐక్యూఏసీ (ఐక్యూఏసీ) బాధ్యతలు, చీఫ్ సూపరింటెండెంట్ వంటి వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కళాశాల విద్యా, పరిపాలనా , అభివృద్ధి కార్యక్రమాల్లో విశేషంగా భాగస్వామ్యం అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం పీఎం-ఉషా (పి ఎం ఉష) కోఆర్డినేటర్గా బాధ్యతలు స్వీకరించి కళాశాల అభివృద్ధికి తన సేవలను కొనసాగిస్తున్నారని తెలిపారు.

విద్యార్థులు , కళాశాల సిబ్బంది మాట్లాడుతూ కళాశాల అవసరాల కోసం సాధారణ పని దినాలు, పని సమయాలకు అతీతంగా కూడా అంకితభావంతో పనిచేస్తూ, కళాశాల అభివృద్ధే లక్ష్యం -- విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయం అనే భావనతో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా పరిసర గ్రామాలు , మారుమూల ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయన చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందిన డా. ప్రయాగ మూర్తి ని ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో దుస్సాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

## గొల్లపాలెం సహకార బ్యాంకులో చోరీ

ఏటీఎం పగులగొట్టి రూ.4.35 లక్షల నగదు అపహరణ

బ్యాంకులోకి ప్రవేశించి సీసీ కెమెరాలు ఆఫ్ చేసిన దుండగులు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గొల్లపాలెం పోలీసులు



**కాజులూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 7:** గొల్లపాలెం గ్రామంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం యంత్రాన్ని పగులగొట్టి అందులోని రూ.4,35,500 నగదును అపహరించడంతో పాటు బ్యాంకులోకి చొరబడి పలు వస్తువులను కూడా దొంగిలించారు. ఈ ఘటన శనివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం మధ్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.బ్యాంకు ఇన్‌చార్జ్ మేనేజర్ గొల్లపల్లి పకీర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటలకు బ్యాంకు ప్రాంగణాన్ని, బ్యాంకు భవనం పశ్చిమ వైపున ఉన్న ఏటీఎంను తాళం వేసి మేనేజర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం సుమారు 9.30 గంటలకు బ్యాంకు వద్దకు చేరుకుని షట్టర్ తెరవడానికి ప్రయత్నించగా ఏటీఎం షట్టర్ వద్ద ఇనుప రాడ్ (క్రోబార్) పడి ఉండటాన్ని గమనించారు.అనుమానం వచ్చి ఏటీఎం షట్టర్ తెరిచి పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం యంత్రాన్ని బలవంతంగా పగులగొట్టి అందులో ఉన్న రూ.4,35,500 నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. అనంతరం బ్యాంకు భవనాన్ని పరిశీలించగా వెనుక వైపున ఉన్న కిటికీ గ్రిల్‌ను పగులగొట్టి దుండగులు బ్యాంకులోకి ప్రవేశించినట్లు గుర్తించారు.బ్యాంకులోకి ప్రవేశించిన అనంతరం విద్యుత్ సరఫరాను నిలిపివేసి సీసీ కెమెరాలను ఆఫ్ చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అలాగే బ్రాంచ్ మేనేజర్‌కు చెందిన మొబైల్ ఫోన్‌ను ఆయన డెస్క్‌పై నుంచి, మరో డబ్బీని కూడా దుండగులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం చోరీ చేసిన సొత్తుతో నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనలో చోరీకి గురైన నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.4,35,500గా అంచనా వేశారు. సమాచారం అందుకున్న వెంటనే కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీ జరిగిన తీరుపై ఆరా తీసి వివరాలను సేకరించారు.ఈ ఘటనపై గొల్లపాలెం ఎస్ఐ ఆర్‌వీఎన్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిందితులను గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

## రాచపల్లిలో భారీ అన్న సమారాధన కార్యక్రమం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 07:** ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని గ్రామంలోని ద్వారక నగర్, నంది వీధి ఆలయ ప్రాంతంలో సోమవారం శ్రీకృష్ణ యాదవ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

?ఈ కార్యక్రమానికి బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

?ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నైదాన రఘు, బర్ల లోవరాజు, కోన గంగాధర్, శ్రీకృష్ణ యాదవ్ ఆలయ కమిటీ ప్రతినిధులు గింజల బాబారాందేవ్ యాదవ్, ఇసరపు సత్యనారాయణ, రామాల వీరబాబు, గింజల సుబ్రమణ్యం, బోట్ట అప్పలరాజు, గింజల శివాజీ, గింజల చిట్టిబాబు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిర్దేశిత గడువులోగా లక్ష్యాలు సాధించాలి

అధికారులకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశం




**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 7:** ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు నిర్ణయించిన గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, క్షేత్రస్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రాధాన్యత అంశాల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.రీ-సర్వే అనంతరం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, రీ-సర్వే నాలుగు, ఐదో దశల పురోగతి, బుక్ ఫర్ ప్రింటింగ్, పీఓడీ సబ్‌డివిజన్, అసైన్మెంట్ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆన్‌లైన్‌లో వివరాలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా హియరింగ్ ప్రక్రియను, 'బుక్ ఏ కాల్' ఫిర్యాదుల విచారణను త్వరగా పూర్తి చేసి తుది ప్రచురణకు సిద్ధం చేయాలన్నారు. ఎన్‌జీఎస్‌పీ ఫిర్యాదులు, ఫారాల పెండెన్సీలను ఈ నెల 10వ తేదీలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్.. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి తహసీల్దార్లు స్థలాలను గుర్తించి పంచాయతీరాజ్ ఏఈలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో దాతల భూములు లేదా జలవనరుల శాఖకు చెందిన భూములను పరిశీలించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణాలను ప్రాధాన్యతగా చేపట్టి పూర్తి చేయాలన్నారు.కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియపై సమీక్షిస్తూ ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు వచ్చిన పింఛన్ దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఆదాయ, ఒంటరి మహిళ, కుల ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా మంజూరు చేయాలని సూచించారు. అర్హులైన వృద్ధులకు ఆధార్‌లోని వయస్సు ఆధారంగా, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ, డప్పు కళాకారులకు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ధ్రువీకరణ చేపట్టి ఈ నెల 26వ తేదీలోగా తుది నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని, తద్వారా బడ్జెట్ మంజూరుకు వీలు కల్పించాలని తెలిపారు.ఉపాధి హామీ పథకం, వీబీజీ రాంజీ-ద్వారా కూలీలకు విస్తృతంగా పనులు కల్పిస్తూ హాజరు శాతాన్ని పెంచాలని, మెటీరియల్ కాంపోనెంట్‌ను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. 'జలధార--జలహారతి' రెండో దశ కింద మంజూరైన రూ.2 కోట్ల నిధులతో నీటి వినియోగదారుల సంఘాల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రాధాన్యత పనులను ప్రతిపాదించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీ విధానంలో సాగునీరు అందేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, పుష్కర కాలువ మరమ్మతు పనులకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిని వేగవంతం చేయడంతో పాటు సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన పనులు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, కౌడా పరిధిలోని సివిల్ పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత బిల్లులను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పీ4, 'కౌశలం' కార్యక్రమాల్లోనూ ఆశించిన స్థాయిలో పురోగతి సాధించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్, జడ్పీ సీఈఓ లక్ష్మణరావు,డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ మోడల్ అధికారి జే. వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ మహమ్మద్ అబ్దుల్ మదీన్, పంచాయతీరాజ్ డీఈ సత్యం, జలవనరుల శాఖ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com